# గ్యాస్ కొరత లేదు

గృహ, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యత
అపోహలను నమ్మవద్దు
అంతరాయం కలగకుండా తగు చర్యలు
జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో:** హైదరాబాద్ జిల్లాలో గ్యాస్ కొరత లేదని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో బుధవారం జిల్లా స్థాయి ఇంధన సరఫరా పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా గృహ, ఆసుపత్రులు, హాస్టళ్ల వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండే విధంగా జరుగుతున్న గ్యాస్ సరఫరాపై ఆమె సమీక్ష నిర్వహించారు. గ్యాస్ కొరత ఉందన్నది కేవలం అపోహ మాత్రమేనని ఇలాంటి వాటిని నమ్మవద్దన్నారు. డిమాండ్ పెరిగిన దృష్ట్యా ఆసుపత్రులు, హాస్టళ్లు, గృహ వినియోగదారులకు అధిక ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి గ్యాస్ సరఫరాపై అవగాహన కల్పించాలని వివిధ గ్యాస్ కంపెనీ ప్రతినిధులను కలెక్టర్ ఆదేశించారు. గృహ వినయోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు తరలించవద్దని, అలా చేసనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిలిండర్ డెలివరి సమయంలో ధృవీకరణ కోడ్‌ను తప్పనిసరిగా పంపాలని వినియోగదారులకు ఆమె సూచించారు.



గ్యాస్ సరఫరా చేసే వాహనాలకు పోలీస్, పౌరసరఫరా శాఖల బృందాలు తగిన భద్రత కల్పిస్తాయన్నారు. ఈ సమావేశంలో చీఫ్ రేషనింగ్ అధికారి రాజిరెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ గ్యాస్ పంపిణీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**గృహ నిర్మాణ దరఖాస్తులపై నివేదిక**

ఇండ్ల నిర్మాణం కోసం పేదలు చేసుకున్న దరఖాస్తులను అర్హత మేర పరిశీలించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఎల్‌వన్ దరఖాస్తులపై అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. భూమి ఉండి ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తులు చేసుకున్న ప్రాంతాలను సర్వే చేసి నివేదిక సమర్పించాలన్నారు. అర్హులైన వారికి కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో కొందరు నివాసం ఉండడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. అట్టి కుటుంబాలను వారికి కేటాయించిన ఇండ్లలోకి వెల్లేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మురికి వాడల్లో గృహ సముదాయాలు నిర్మించుటకు అనువైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పాత హౌసింగ్ కాలనీలను గుర్తించి పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈసమావేశంలో డిఆర్‌ఒ ఈ.వెంకటా చారి, గృహనిర్మాణ శాఖ పిడి అశోక్ చక్రవర్తి, ఆర్డీఓలు సాయిరాం, రామకృష్ణ, తహసిల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీల్లో దుకాణాల వేలం**

డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీల పరిధిలోని దుకాణాలను వేలం ద్వారా విక్రయించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. దీని కోసం విధివిధానాలను సిద్ధం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఈ అంశంపై అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. మొత్తం 99దుకాణాలు ఉన్నాయని వీటిని వేలం ద్వారా విక్రయించాలన్నారు. ఓపెన్ మార్కెట్ వేలం నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వేలానికి కనీస ధర నిర్ణయించి మూడు నుంచి పది శాతం హామి సొమ్మును విక్రయదారుల నుంచి ముందుగా జమచేసేలా చూడాలని ఆమె తెలిపారు. సబ్ రిజిస్ట్రార్లు, డిప్యూటి కమిషనర్లు, రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్, మార్కెట్ ధర ప్రకారం కనీస ధర నిర్ణయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి, గృహనిర్మాణ శాఖ పిడి అశోక్ చక్రవర్తి,ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, ఎస్టేట్ అధికారులు, సబ్ రిజిస్ట్రార్‌లు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## అందరి సంక్షేమం కాంగ్రెస్ లక్ష్యం

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్‌పేట్ మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మార్కెట్ సిబ్బందికి రంజాన్ పండుగ కానుకలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుగ్గ జగదీష్, మహ్మద్ షకీల్, మార్కెట్ అధికారులు పుష్ప, మాధురి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది విక్రయాలు



**ప్రజాపక్షం/అబిడ్స్:** తెలుగు సంవత్సరాది పరాభవ నామ సంవత్సరం ఆగమన పర్వదిన వేడుకలకు నగరం సిద్ధమైంది. ఉగాది పండుగ ఘనంగా జరుపుకునేందుకు, ఉగాది సందర్భంగా తయారుచేసే ప్రత్యేక షడ్రుచుల పచ్చడి ఆస్వాదించేందుకు రెడీ అయ్యారు. వేపపువ్వు, మామిడి, చింత పండు, బెల్లం, ఉప్పు, కారం వంటి అన్ని రుచుల మిశ్రమం నూతన మట్టి కుండలో ఉగాది పచ్చడి తయారీకి అవసరమయ్యే పదార్థాలను సమకూర్చుకునే పనిలో పడ్డారు క్యూర్ సిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇందులో భాగంగానే గోషామహల్, అబిడ్స్, జాంబాగ్, బేగంబజార్, గన్‌ఫౌండ్రీ, మంగళ్‌హాట్, దూల్‌పేట్, నాంపల్లి, మల్లేపల్లి తదితర ప్రాంతాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. ఉగాది సందర్భంగా పలు ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. పూల అలంకరణ, లైటింగ్ ప్రత్యేక ఆకర్షణంగా నిలుస్తున్నాయి. ఉగాది ప్రత్యేక పూజలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక కాలనీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రజలు ఒకచోట చేరి ప్రత్యేకంగా ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి.

## రంగంలోకి టెర్రరిస్ట్ స్నైపర్లు: రాజాసింగ్



**ప్రజాపక్షం/గోషామహల్:** శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా తనను చంపేందుకు బెదిరింపులు వచ్చాయని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. దూల్‌పేట్‌లోని ఆకాష్‌పురి హనుమాన్ ఆలయంలో వాలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల తనకు ఒక లేఖ వచ్చిందని.. అందులో ముగ్గురు టెర్రరిస్ట్ స్నైపర్లు తనపై దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నట్లు తెలిపారు. శోభాయాత్ర సమయంలో రెండు చోట్ల బాంబులు పెట్టే కుట్ర ఉందని కూడా ఆరోపించారు. ఈ విషయం పోలీసులకు చెప్పలేదని.. ఎందుకంటే వారు దీనిని సీరియస్‌గా తీసుకోరని నాకు తెలుసు.. అంటూ పేర్కొన్నారు.

## పేద మహిళలకు చీరలు పంపిణీ




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** పేద మహిళలకు చీరలను పంపిణీ చేయడం జరిగింది. రోషన్‌లాల్ అగర్వాల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సాయిబాబా దేవాలయం వీధిలో బుధవారం ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకుని పేద మహాళలకు వస్త్రాల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ట్రస్ట్ చైర్మన్ రోషన్‌లాల్ (కాకా) తనయుడు రాజేష్ రోషన్‌లాల్ హాజరై పంపిణి చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు లక్సమం వర్మ, వి.నాగభూషణం, నవ్వ రాజు, కె.రఘువీర్ , బబ్లూ, అంజియాదవ్, కూరగాయల శ్రీను, డీజే రవి, ధన్‌నాయక్, కుమార్ నాయక్, రాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లు పరిశుభ్రంగా ఉంచాలి

చార్మినార్ జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా 13వ రోజు సందర్భంగా బుధవారం జోన్ పరిధిలోని కూరగాయలు, పండ్ల మార్కెట్లలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మార్కెట్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, డ్రైనేజీ లైన్లను శుభ్రపరచడం, చెత్త బుట్టలను ఖాళీ చేయడం, అలాగే శానిటేషన్ సిబ్బంది ద్వారా సమగ్ర శుభ్రత చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.



## రంజాన్ కానుకలు పంపిణీ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమం ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో జరిగింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ వెనకాల ఉన్న కుతుబ్‌షాహీ మీరాజ్ మజీద్‌లో పేద ముస్లిం మైనార్టీలకు రంజాన్ కానుకలను మాజీ కార్పొరేటర్ విజయరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులతో పాటు, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

## ప్రహరీ కూలిన సిటీ కాలేజీపై దృష్టి సారించరా?




**ప్రజాపక్షం/చార్మినార్:** కుతుబ్‌షాహీల ముందుచూపు.. అసఫ్‌జాహీల ఆలోచనలకు ప్రతిరూపంగా పేరొందిన భాగ్యనగరంలో నిర్మితమైన సిటీ కాలేజీ భవనం క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటోంది. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1921లో పాఠశాలగా ప్రారంభించగా.. 1929లో కాలేజీగా అభివృద్ధి చేయడం జరిగింది. క్రమంగా స్వయం ప్రతిపత్తి దక్కించుకున్న విద్యాసంస్థగా గుర్తింపు పొంది... నాక్ నుంచి ఏప్లస్‌ప్లస్ గ్రేడ్‌తో స్థానం పదిలపరుచుకున్నది. 1965లో రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోకి వచ్చిన కాలేజీపై ఒకింత నిర్లక్ష్యం వహించారని చెప్పవచ్చు. కాలేజీలో చదివిన ఎంతో మంది వివిధ రంగాల్లో దేశంలోనే గుర్తింపు పొందిన విషయం విధితమే. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కళాశాల శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల కాలేజీ ప్రధాన భవనానికి మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టడంతో పాటు వెనుక భాగంలో కొత్త భవన నిర్మాణం కూడా జరిగింది. అయితే, ఈ పనులన్నీ జరుగుతున్నప్పటికీ అత్యంత ముఖ్యమైన ప్రహరీ మరమ్మత్తులు మాత్రం విస్మరించారు. ప్రస్తుతం ప్రహరీ శిథిలావస్థకు చేరుకుని, కొన్ని చోట్ల కూలిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో కాలేజీ భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా, కాలేజీ లోపల కొన్ని గదుల్లో పాత, విరిగిన చెక్క బెంచీలు మూలన పేరుకుపోయి ఉండటం నిర్వహణ లోపాలను సూచిస్తోంది. ఇకనైనా ప్రభుత్వం దృష్టి సారించి చారిత్రక సిటీ కాలేజీ భవనం పటిష్టతకు చర్యలు చేపట్టాలని పాతబస్తీవాసులు కోరుతున్నారు.

## 25న లంబాడీల 'చలో హైదరాబాద్'

**ప్రజాపక్షం/సోమాజిగూడ:** గిరిజన బంజారాల ఆరాధ్య దైవ్యం సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేవాలాల్‌ను అచ్చంపేటలో ఒక్క ప్రాంతానికే పరిమితం చేస్తే సహించబోమన్నారు. హైదరాబాద్‌లో వంద ఎకరాల్లో సేవాలాల్ విగ్రహం, మ్యూజియం, విద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించ తలపెట్టినట్టు తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సేవాలాల్ సేన వ్యవస్థాపకులు భూక్య సంజీవ్ నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబాలు నాయక్, సేవాలాల్ బంజారా సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్ర మోతీలాల్ నాయక్ మీడియాతో మాట్లాడారు. లంబాడీల ఓట్లతోనే గెలిచిన అని చెప్పిన సిఎం రేవంత్‌రెడ్డి లంబాడీల పట్ల చిత్తశుద్ధి ఉంటే వారి ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. తమ పూర్వీకుల వేల ఎకరాల భూమి ఉన్న హైదరాబాద్‌లో కనీసం 100 ఎకరాలు కేటాయించి సేవాలాల్ విగ్రహాన్ని, గిరిజన సాంస్కృతిక కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో లంబాడీలంతా ఐక్యమై ఉద్యమిస్తారని హెచ్చరించారు. సమావేశంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి ప్రధానకార్యదర్శి భరత్ చవాన్, రుక్మిని బాయి, ఒయు నేత కరాటే రాజు, లంబాడీ సేన అధ్యక్షులు బాలు నాయక్, శివరాం మహారాజ్, విష్ణు నాయక్, బాసి నాయక్, సక్రిబాయి, గణేశ్ నాయక్ రవి నాయ్, అభి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## రూ.5 లక్షల హాషిస్ ఆయిల్ పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసులకు, ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడకుండా గత ఐదేళ్లుగా పాడేరు నుంచి హైదరాబాదుకు హాషిష్ ఆయిల్ సరఫరా చేస్తున్న ఉల్లంగి వెంకటేశంను మల్కాజిగిరి డిటిఎఫ్ సిఐ భరత్ భూషణ్ సిబ్బంది ఎట్టకేలకు పట్టుకున్నారు. నిందితుడిని హషిస్ ఆయిల్‌తో నందనవనం ఫారెస్ట్ నారపల్లి ప్రాంతంలో పట్టుకున్నారు. ఎక్సైజ్‌తో పాటు పంజాగుట్ట, ఫిలింనగర్, టప్పా ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్లలోనూ, ఎక్సైజ్ స్టేషన్లలో నిందితుడుగా ఉన్న ఉల్లంగి వెంకటేశం ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడ్డారు.

ఉల్లంగి వెంకటేశం వద్ద డిటిఎఫ్ సిఐ భరత భూషణ్ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి సిబ్బంది కలిసి రూ.ఐదు లక్షల విలువ చేసే 1.04 కిలోల హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. హాశిష్ ఆయిల్‌ను గత ఐదు సంవత్సరాలుగా పాడేరు నుంచి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నట్లు మల్కాజ్‌గిరి ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ కుమార్ తెలిపారు. హాషిష్ ఆయిల్ పట్టుకున్న డిటిఎస్ టీంను ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అభినందించారు.

## మంత్రి కోమటిరెడ్డి ఇంటిని ముట్టడిస్తాం

తక్షణమే ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** బిసిలను రాజకీయంగా అణగదొక్కేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. పిసిసి అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌ను తొలగించి, ఆ పదవిని జగ్గారెడ్డికి ఇస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు గెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీ చిట్‌చాట్‌లో వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిసిల ఎదగడం ఓర్వలేకనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారపు గణేశ్‌చారి అధ్యక్షత జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి ఏం మాట్లాడుతున్నారో నోరు తిరగకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ 60 లక్షల సభ్యత్వంలో బహుజనులు ఎంత మంది, రెడ్లు ఎంత మందో తేల్చుకోవాలని అన్నారు. బహుజనులు ఓటేస్తేనే కాంగ్రెస్ అధికారంలోకొచ్చిందన్నారు. బిసిల పట్ల అవమానకరంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తున్నామన్నారు. ఆయన బిసిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంత్రి సొంత జిల్లా నల్లగొండలో రెండు లక్షల మంది బిసిలతో బహిరంగ సభ ఏర్పాటు చేసి, ఆయన ఇంటిని ముట్టడిస్తామని జాజుల హెచ్చరించారు. బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో పలువురు బిసి సంఘాల నేతలు పాల్గొన్నారు.




## ధర్మనిధి పురస్కారాల ప్రధానోత్సవం

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** సాహితీవేత్తలకు ధర్మనిధి సాహితీ పురస్కారాలను ప్రధానం చేయడం జరిగింది. తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన కార్యక్రమానికి పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఎనిమిది మంది సాహితీవేత్తలకు పురస్కారాలను అందించారు. పురస్కారాల్లో భాగంగా.. డా.తిరుమల శ్రీనివాచార్య ధర్మనిధి పురస్కారం గోపగాని రవీందర్.. శైలజా మిత్ర(తిరుమల స్వరాజ్యలక్ష్మి ధర్మనిధి పురస్కారం తుమ్మల దేవరావు (డా.బిఎన్‌శాస్త్రి).. డా.చీదెళ్ల సీతాలక్ష్మి (ఆచార్య మడుపు కులశేఖర్‌రావు) పురస్కారం, డా.కాసర్ల నరేష్‌రావు (నారపురాజు రాఘవ సీత) పురస్కారం, పెద్దిరెడ్డి గణేష్ (బూర్గుల రంగనాథరావు) పురస్కారం, భండారు విజయ (డా.కె.అంజిరెడ్డి) పురస్కారం, వేదార్థం మధుసూదన శర్మ(తిరుకోవలూరు శ్రీలక్ష్మి ) పురస్కారాలను అందుకున్నారు. తెలంగాణ పరిషత్ ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## 28, 29 తేదీల్లో విజయవాడలో ఐజెయు 11వ ప్లీనరీ!

Indian Journalists Union



**హైదరాబాద్/చండీగఢ్ :** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ 11వ ప్లీనరీ (మహాసభలు) ఈనెల 28, 29 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ (అమరావతి)లో జరగనున్నట్లు ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్మూ, జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ప్లీనరీ సమావేశాలను ప్రారంభిస్తారని, పలువురు కేంద్రమంత్రులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు అతిథులుగా హాజరై సందేశాలు ఇస్తారని వారు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఐజెయు రెండవ ప్లీనరీ సమావేశాలు 1992లో విజయవాడలో జరిగాయనీ, తిరిగి 34 ఏళ్ల తర్వాత 11 వ ప్లీనరీకి ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆతిథ్యం ఇస్తోందని ఆ ప్రకటనలో వివరించారు. ఈ సమావేశాలకు దేశంలోని 25 రాష్ట్రాల నుండి ఎన్నికైన ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల ఐజెయు అనుబంధ యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, హాజరౌతారని తెలిపారు. ఈ సమావేశాల్లో దేశంలో నేడు మీడియా రంగంలో నెలకొన్న స్థితిగతులు, వృత్తిపరమైన సమస్యలు, ఇటీవల మీడియా స్వేచ్ఛకు ఎదురవుతున్న ప్రమాదాలు, సంస్థాగత విషయాలు, వంటింశాలపై చర్చలు జరుగుతాయని వారు ఆ ప్రకటనలో వివరించారు. మీడియా సంబంధిత అంశాలపై పది తీర్మానాలను ఆమోదించడంతో పాటు, వర్కింగ్ జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ చర్యల సాధన కోసం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణను సమావేశాలు ఖరారు చేస్తాయని ఆ ప్రకటనలో తెలిపారు. రానున్న రెండేళ్ల పదవీ కాలానికి నూతన జాతీయ కార్యవర్గ ఎన్నికలు కూడా ప్లీనరీలో జరుగుతాయని ఆ ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) చీఫ్ పాట్రన్‌గా సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షునిగా, ఎపియుడబ్ల్యుజె అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా ఏర్పాటైన ఆహ్వాన సంఘం ప్లీనరీని విజయవంతం చేయడానికి చురుగ్గా కృషి చేస్తున్నదని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో వివరించారు.

## వాయిదా తీర్మానాల తిరస్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సిపిఐ శాసన సభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు శాసనసభలో బుధవారం వాయిదా తీర్మానం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఏజెన్సీ వ్యవస్థలను రద్దు చేసి ప్రభుత్వమే ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని బిఆర్ఎస్ సభ్యులు కె.తారకరామారావు తదితరులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను కూడా తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## మాజీ శాసనసభ్యులకు శాసనసభ సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల మరణించిన పలువురు మాజీ శాసన సభ్యులకు శాసనసభ సంతాపాన్ని తెలియజేసింది. మాజీ ఎంఎల్ఎలు కె.రాములు, సిహెచ్.రాంరెడ్డి, సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీల మరణం పట్ల సభ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. ఈ ముగ్గురు సభ్యులకు సంతాపాన్ని తెలియజేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సభ ఆమోదించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించింది.



## గ్యాస్ కొరతతో హోటల్స్ మూసివేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గ్యాస్ కొరతతో గత నాలుగైదు రోజులుగా పలు ప్రాంతాలలో హోటళ్లు మూతపడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ కొరత లేదంటున్నా..కొరత తీవ్రంగా ఉందని హోటళ్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరత ఉందని ఇదే అదునుగా గ్యాస్ సరఫరా చేసే ఏజెన్సీ సిబ్బంది డొమెస్టిక్ సిలిండర్ 2 వేల రూపాయల నుండి 3వేల వరకు, కమర్షియల్ సిలిండర్ రూ.4 వేల నుండి 7 వేల వరకు విక్రయిస్తున్నారు. గ్యాస్ దొరకక, రేట్లు పెంచడంతో రోజు బిజీబిజీగా కన్పించే హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మూసివేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని నిర్వాహకులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టి సారించి గ్యాస్ కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



## వైద్యంకోసం సిఎం రిలీఫ్ ఫండ్

**ప్రజాపక్షం/కాప్రా :** పేద ప్రజలు అవసరమైన పక్షంలో వైద్యం కోసం సిఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని వినియోగించుకోవాలని మల్లాపూర్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సూచించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తరఫున ఆయన మంగళవారం ఈ పథకం కింద మంజూరైన అనుమతి పత్రాలను అందచేసారు. డివిజన్‌కు చెందిన విజయకు రూ. 24 వేలు, మానెమ్మకు రూ.36 వేల 500, ఎల్లయ్యకు రూ. 60వేలు, అనిల్ చాబెద్‌కు రూ. 20వేలు, గంట రమేష్‌కు రూ.60 వేలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణులు శ్రవణ్, జబ్బార్, లక్ష్మ ణ్ యాదవ్‌లు పాల్గొన్నారు.



## దివాకర్‌కు కొలను హన్మంత్‌రెడ్డి పరామర్శ

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ 2వ వార్డు మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఇటీవల ప్రగతి నగర్‌లో జరిగిన ఫర్నిచర్ షాప్ అగ్నిప్రమాద సమయంలో సహాయక చర్యల్లో పాల్గొంటూ గాయపడి కాలు ఫ్రాక్చర్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. దివాకర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం ఎల్లప్పుడూ ముందుండే నాయకుడు దివాకర్ అని, ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అర్హులైన వారు సిఎం సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** అర్హులైన ప్రతీ ఒక్కరూ సిఎం సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలని బిఆర్‌ఎస్ నాయకులు సూచించారు. బుధవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో 126 జగద్గిరిగుట్ట డివిజన్‌కు చెందిన నలుగురు ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు డివిజన్‌కు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులు ఎనుముల ఆదిలక్ష్మి కి రూ.50,000, యెన్నం భారతమ్మకు రూ.75,000, బోనం రామ సుబ్బారావు రూ.2లక్షలు, కమ్మరి గౌతమికి రూ.75,000 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల పెన్నిధి ముఖ్యమంత్రి సహాయనిధి అని, అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్సకోసం ఎదురుచూస్తున్న ప్రతీ ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు మెట్ల శ్రీను, సయ్యద్ సాజీద్, తదితరులు పాల్గొన్నారు.



## దేవేందర్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మాజీ హోం మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యులు తూళ్ల దేవేందర్‌గౌడ్ జన్మదినం పురస్కరించుకుని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, నాయకులు గూడురు అశోక్‌గౌడ్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రమట్టి టిప్పర్లు సీజ్

**ప్రజాపక్షం/నవాబ్ పేట్ :** అనుమతి లేకుండా నవాబ్ పేట్ మండలం ఆర్కతల గ్రామం నుండి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారన్న పక్క సమాచారంతో టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారం ఉదయం మైతభ్ ఖాన్ గూడ ప్రధాన చౌరస్తా వద్ద మూడు టిప్పలను పట్టుకొని నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అనుమతులు లేకుండా అక్రమ ఎర్రమట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై పుండ్లిక్ హెచ్చరించారు.

# టిజిబి నూతన భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామాజిక బాధ్యతలో భాగంగా వరంగల్, హైదరాబాద్‌లలో తన నూతన భవనాలను విస్తరించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఎస్‌బిఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు సెట్టి హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టిజిబి) నూతన ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశా రు. టిజిబి దేశంలోని ప్రముఖ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా నిలిచి, రూ. 79,667 కోట్ల వ్యాపారంతో 90 లక్షలకుపైగా ఖాతాదారులకు సేవలందిస్తోంది. కొత్త హెడ్‌ఆఫీస్ నిర్మాణంతో బ్యాంక్ పరిపాలనా సామర్థ్యం మరింత విస్తరించనుంది. ఇక వరంగల్‌లో ఎస్‌బిఐ తన సిఎస్‌ఆర్ కార్యక్రమాల కింద కీలక సహాయాన్ని ప్రకటించింది. గ్రామీణ పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.75 లక్షలు, వృద్ధాశ్రమ పునరుద్ధరణ కు రూ.17.5లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా చైర్మన్ సెట్టి మాట్లాడుతూ ఎస్‌బిఐ బ్యాంకింగ్ సేవలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలో దీర్ఘకాలిక మార్పుకు కట్టుబడి ఉందన్నారు. ప్రాథమిక విద్య బలోపేతం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెరుగుదల, మహిళల మెన్స్ట్రువల్ హైజీన్ వంటి అంశాలు సిఎస్‌ఆర్‌లో ప్రాధాన్యంగా ఉన్నాయని తెలిపారు.తెలంగాణలో 1,337 శాఖలతో ఎస్‌బిఐ వ్యవసాయం, ఎంఎస్‌ఎంఇలు, స్వయం సహాయక సంఘాలకు మద్దతు అందిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తోంది.



## రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది ప్రతిస్పందన సామర్థ్యాన్ని పెంచేందుకు దక్షిణ మధ్య రైల్వే, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) సంయుక్తంగా బోలారం రైల్వే స్టేషన్‌లో బుధవారం భారీ స్థాయి మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఒక అనూహ్య ఘటనలో రైలు బోగీల్లో సుమారు 24 మంది ప్రయాణికులు చిక్కుకుపోయినట్లుగా ఊహించి ఈ విన్యాసం చేపట్టారు. సమాచారం అందుకున్న వెంటనే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఎఆర్‌టి) బృందం సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించింది. అదే సమయంలో రైల్వే ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ సమాచారం మేరకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం కూడా అక్కడికి చేరుకుని సంయుక్తంగా రక్షణ చర్యలు చేపట్టింది. ప్రత్యేక పరికరాల సహాయంతో చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. ఈ మాక్ డ్రిల్ ఉదయం 9.50 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. హైదరాబాద్ డివిజన్‌కు చెందిన రైల్వే సిబ్బందితో పాటు ఎన్‌డిఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్‌కు చెందిన 25 మంది సిబ్బంది, హైడ్రా బృందం 8 మంది, ఫైర్ బ్రిగేడ్ 11 మంది పాల్గొన్నారు. అదనంగా స్పార్మ్‌వీ వంటి ప్రత్యేక వైద్య సహాయక వాహనాలు కూడా వినియోగించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌ఆర్‌ఆర్ ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె. వెంకటరమణ రెడ్డి, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ, ఎన్‌డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ధమోదర్ సింగ్ తదితర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.





## ప్రపంచ శాంతిని పరిరక్షించాలి

### భారత జాతీయ మహిళా సమాఖ్య మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు యు.హేమవతి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దురంహం కారంతో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కూటమి దేశాలు కొనసాగిస్తున్న యుద్ధాన్ని ఆపేసి ప్రపంచ శాంతిని పరిరక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌జెడబ్ల్యు) మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు యు.హేమవతి డిమాండ్ చేసారు. ఎన్‌ఎఫ్‌జెడబ్ల్యు ఆధ్వర్యంలో బుధవారం ఇసిఐఎల్‌లోని కాప్రా జిహెచ్‌ఎంసి కార్యాలయం ఎదుట ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధానికి వ్యతిరేకంగా ధర్నా చేసారు. యుద్ధ కారణంగా పెరిగి పోతున్న ధరలను తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం తగు చర్య లు తీసుకోవాలంటూ ఈ ధర్నాలో గ్యాస్ సిలిండర్‌ను ప్రదర్శిస్తూ నినదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రంప్ తనకు తానే శాంతి దూతగా వర్ణించుకొంటూ మరో పక్క తన సామ్రాజ్య వాదాన్ని పెంచుకొనే లక్ష్యంగా యుద్ధాలే అస్త్రాలు చేసుకొని ముందుకు వెళ్లటం సిగ్గు చేటన్నారు. యుద్ధ ప్రభావం కారణంగా భారతదేశంతో పాటు అనేక దేశాల పేద, బడుగు, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు, విద్యార్థులు గ్యాస్ కొరత బాధలను తీవ్రంగా ఎదుర్కోవలసి వస్తోందన్నారు. హోటళ్లు, హాస్టళ్లు మూసి వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌జెడబ్ల్యు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షురాలు మాధవి, గిరిజ, సహాయ కార్యదర్శి, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వరూప, లత, ఆండాలు, రమ, సరిత, జయమ్మ,తదితరులు పాల్గొన్నారు.




## ముబారక్ పూర్ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక అందిస్తాం

### ఇంచార్జి జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీకాంత్

**ప్రజాపక్షం/నవాబ్‌పేట్ :** నవాబ్ పేట్ మండల పరిధిలోని ముబారక్ పూర్ గ్రామంలో గత జనవరి 28న జరిగిన మైనర్ బాలిక మృతిపై జిల్లా సీడబ్ల్యూసీ అధికారులు నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు బుధవారం ముబారక్ పూర్ గ్రామానికి నిజ నిదరణ కమిటీని సభ్యులు చేరుకొని బాలిక మృతి సంబందించిన వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీకాంత్,జిల్లా కార్మిక శాఖ అధికారి యాదయ్య మాట్లాడుతూ జనవరి 28న జరిగిన బాలిక (మైనర్) మృతిపై ముబారక్ పూర్ గ్రామానికి రావడం జరిగిందని చెప్పారు. రైతు దయాకర్ రెడ్డిని కూడా విచారణ చేయడం జరిగిందని ట్రాక్టర్ మాదే కానీ మా పొలంలో మాత్రం బాలిక పనిచేయడం లేదని ఆయన తెలిపారని అన్నారు. ఇంకా గ్రామస్తులను కూడా పూర్తిస్థాయిలో ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుంటామని చెప్పారు. బాధిత కుటుంబ సభ్యుల గ్రామానికి చేరుకొని వారిని కూడా విచారణ చేస్తామని, మైనర్ బాలిక మృతికి సంబంధించిన అన్ని రకాల వివరాలు సేకరించి నివేదికను జిల్లా సీడబ్ల్యూసీ అధికారులకు అందజేస్తామని తెలిపారు. అధికారులు, నిజనిర్ధారణ కమిటీ సభ్యులు నామమాత్రంగా విచారణ చేయకుండా బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా విచారణ చేసి నివేదికను సంబంధిత అధికారులకు సమర్పించాలని గ్రామస్తులు కమిటీ సభ్యుల దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ నిజ నిర్ధారణ కమిటీలో శివరాజ్, కవిత, రాజ్ నాయక్, అర్చిల, శ్రీనివాస్ సర్పంచ్ జయయ్య, వార్డు సభ్యులు, తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సమాజ సేవకు అంకితభావంతో పనిచేసిన మహనీయుడు పెంచల రెడ్డి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ వ్యవస్థాపకులు యాలమూరి పెంచల రెడ్డి 29వ వర్థంతి సందర్భంగా బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి వారి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాలమూరి పెంచలరెడ్డి సమాజ సేవకు అంకితభావంతో పనిచేసిన మహనీయులని కొనియాడారు. భగత్‌సింగ్ నగర్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, కృష్ణగౌడ్, రషీద్, మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.



## ఎంపి లాడ్స్ నిధులతో బోర్లు ప్రారంభం

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ బిజెపి నాయకుల ప్రత్యేక చొరవతో డబుల్ బెడ్ రూమ్ వాసులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యతో పార్లమెంట్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎక్కడ ఉన్నాయో అక్కడ ఏమేం సమస్యలు ఉన్నాయి అని వెంటనే సమస్యకు పరిష్కారం చూడమని ఎంపి ఈటల రాజేందర్ అధికారులకు ఆదేశించారు. ఎంపి. లార్డ్స్ నిధులతో దుండిగల్ డబల్ బెడ్ రూమ్‌ల సముదాయంలో 36 లక్షలతో బోర్లు వేయించారు. ఎలాంటి సమస్యలు ఉన్న స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ ఎస్టిపి, రేషన్ షాపులు, లాంటి సమస్యలు బిజెపి నాయకుల దృష్టికి తీసుకువస్తే బిజెపి పక్షాన మేము ముందుండి పరిష్కారానికి చొరవ తీసుకుంటామని తెలియజేశారు.

మేడ్చల్ ఇంచార్జ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడు తూ, గత అధికార పార్టీ ప్రస్తుత అధికార పార్టీ ప్రజలకు చేసింది ఏమీ లేదనీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇండ్లు కేటాయిస్తే కెసిఆర్ మేము ఇచ్చినామని జబ్బలు చర్చుకోవడం, హంగామా చేయడం తప్ప ప్రస్తుత అధికార పార్టీ ఇండ్లలో ఉన్న వారికి ఎక్కడో ప్లాట్ ఉంది, ఎక్కడో కరెంటు మీటర్ ఉంది, ఎక్కడో కారు ఉందని, వీటిని రద్దు చేస్తామని భయపెట్టడం తప్ప వారి సమస్యకు పరిష్కారం చూపింది లేదనీ డబ్బులు పెట్టిన ఒకేసారి 9 బోర్లతో వారి దాహం తీర్చిన మరో భగీరథుడు ఎంపి ఈటల అనీ, ఇప్పటికే దుండిగల్ సర్కిల్ పరిధిలో మొదట బౌరంపేట్ ప్రభుత్వ పాఠశాల, తరువాత గండిమైసమ్మ, బహదూర్ పల్లి డబల్ బెడ్ రూమ్‌లు, ఈరోజు దుండిగల్, డబల్ బెడ్ రూమ్ లలో మొత్తం 17 కు పైగా బోర్లు వేయించి ప్రజల దాహార్తి తీర్చిన ఈటల రాజేందర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు శ్యామ్ రావ్, మున్సిపల్ ఉపాధ్యక్షులు ఎంబరి ఆంజనేయులు, ఆకుల విజయ్, తలారి రాజకుమార్, వెంకటేష్ నాయక్, టింకు, కాలనీ వాసులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






## సామాన్యుల సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఇళ్ల స్థలాల పట్టాల కోసం మార్చి 24న తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ పిలుపిచ్చారు. ఇసిఐలోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో బుధవారం జిల్లా కార్యవర్గ సభ్యులు రచ్చ కిషన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాల మీద మోపబడుతున్న భారాలను చూసి కూడా మౌనం పాటిస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాడాల్సిన అవసరాన్ని గుర్తు చేసారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ, రైతుల సంక్షోభం, కార్మికుల హక్కుల ఉల్లంఘన వంటి సమస్యలను ప్రజా జీవనాలను మనుగడ లేకుండా చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకోసం పనిచేస్తూ సాధారణ ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నాయని ఆరోపించారు. పేద, మధ్య తరగతి ప్రజల జీవన స్థితిగతులు నానాటికి దారుణంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. అదే విధంగా గత కొద్ది ఏళ్లుగా పేదలు ప్రభుత్వ భూదాన్, భూముల్లో గుడిసెలు వేసికొని దీనావస్థలో జీవనాలు గడుపుతున్నా వారికి కనీస మౌలిక సదుపాయాలకు కల్పించటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. దేశానికి స్వతంత్రం లభించి 77 ఏళ్లు గడిచినా పేద ప్రజలకు కనీసం నిలువ నీడ లేకపోవటం అత్యంత విషాదకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం దక్కించుకొనేందుకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలన్న డిమాండ్లతో ఈ నెల 24న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భారీ సంఖ్యలో హాజరయ్యే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాల కూటమి కొనసాగిస్తున్న యుద్ధ ప్రభావంతో ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని, వంట గ్యాస్ సంక్షోభం కారణంగా అనేక పరిశ్రమలు, హోటళ్లు, హాస్టళ్లు మూతపడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు, టి.శంకర్, హరినాథరావు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



## కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవడం గొప్పతనం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మండలం దుండిగల్ గ్రామస్తులు సుమారు 20 మంది భారత కమ్యూనిస్టు పార్టీలో నేడు దుండిగల్ లోని సిపిఐ స్థలం వద్ద సిపిఐలో చేరారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొని వారికి సభ్యత్వం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులుగా గత పది సంవత్సరాలనుండి కార్మికులు సంఘంలో ఉండి కార్మికుల సమస్యల కోసం సిపిఐ కృషి చెయ్యడం వల్ల, వారికోసం నిత్యం నిస్వార్థంగా నిజాయితీగా పనిచెయ్యడం వల్ల నేడు వారందరు సిపిఐలో చేరడంతో ప్రజలు సిపిఐ వైపు చూస్తున్నారు అనేదానికి నిదర్శనమని అన్నారు. సిపిఐ లో చేరడం వల్ల ఎలాంటి డబ్బులు రావని, సంపాదన ఉండదని కానీ ప్రజల కోసం పనిచెయ్యడం ద్వారా సమాజంలో మంచి మనిషిగా గుర్తింపు పొందుతారని అన్నారు. డబ్బులు, మద్యం , భోజనాలు లాంటి ప్రలోభాలకు సిపిఐ గురి చెయ్యదని తెలిసినప్పటికి పార్టీలో చేరడం గొప్ప విషయమని.. కావున సిపిఐ కార్యకర్తలుగా నిజాయితీగా ఉంటూ ప్రజా సమస్యల కోసం పనిచెయ్యాలని కోరారు. రానున్న రోజుల్లో మరింత విస్తృత పర్చడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, శ్రీనివాస్‌లు కూడా అతిథులుగా పాల్గొని చేరినవారికి సభ్యత్వ కార్డులు అందజేశారు. సిపిఐ దుండిగల్ నాయకులు స్వామీ, మల్లేష్, వెంకటేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/బంట్వారం :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరుపేదలకు అందించే చెక్కులను పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి కార్యాలయం నుండి సిఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆసుపత్రిలో మెరుగైన వైద్య ఖర్చుల కోసం, బంట్వారం మండల పరిధిలో ఉన్న రొంపల్లి గ్రామానికి చెందిన బోయిని నాగప్పకు 30 వేలు, మిదొడ్డి నర్సిములుకు 25 వేల రూపాయలు, బక్క రెడ్డి చంద్రకళకు 41 వేల రూపాయలు గల చెక్కులను పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆదేశా ల మేరకు ప్రభుత్వ వ్యక్తి సహాయకులు శ్రీ వై. హరి ప్రసాద్ చేతుల మీదుగా లబ్ది దారులకు బుధవారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి. శ్రీనివాస్, రొంపల్లి మాజీ ఎంపిటిసి శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎక్సైజ్ పోలీసుల దాడులు

### 3.6కిలోల గంజాయి స్వాధీనం

### ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు చేశారు. విశ్వసనీయ సమాచారంతో పాలిషింగ్ యూనిట్లే లక్ష్యంగా బిహార్‌కు చెందిన కార్మికుడు గంజాయి విక్రయాలు చేపడుతున్నారన్న సమాచారంతో బుధవారం తాండూరు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 3.6కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. తాండూరు మండల పరిధి గౌతాపూర్ సమీపంలోని ఓ పాలిషింగ్ యూనిట్‌లో గంజాయి అక్రమ నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు ఆకస్మికంగా దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో అక్కడ పాలిషింగ్ యూనిట్‌లో బిహార్‌కు చెందిన యువకుడు ముస్తాకిన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనివద్ద గంజాయి ప్యాకెట్లు లక్ష్యమైనట్లు వివరించారు. ఎక్సైజ్ పోలీసుల విచారణలో నిందితుడు ముస్తాకిన్ కీలక విషయాలను వెల్లడించారు. బిహార్ రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి తాండూరుకు తీసుక వచ్చి తాను పనిచేస్తున్న యూనిట్‌లలోని కార్మికులకు, ఇతర ప్రాంతాల్లోని కూలీలకు గంజాయిని విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడుపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసున మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడులలో తాండూరు ఎక్సైజ్ ఇంచార్జీ సిఐ రాణి, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది బీమయ్య, రవికిషోర్, రమేష్, రాజేందర్, సతీష్ తదితరులు ఉన్నట్లు తెలిపారు.



